క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



ఆలయ ప్రాంగణంలో భక్తులు

జి.సిగడాం: ఆనందపురంలోని షిరిడీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100 అడుగుల వెంకటి సాయికోటి మహాస్థూపం వద్ద పూజలు జరిగాయి. అనంతరం ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు.

బారువ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సౌజన్య



శ్రీకాకుళం: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్ పనిచేసిన పి.సౌజన్య సోంపేట మండలం బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సౌజన్యకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో తొగరాం, కంచిలి ప్రిన్సిపాల్స్ యు.వి.ఎస్.వర్మ, యు.జగదీష్ కుమార్, అధ్యాపకులు రామలక్ష్మి, కిరణ్‌కుమారి, భారతి, జయ సుధాకర్, అప్పారావు, మోహన్‌రావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈఈగా లతాశ్రీ



జి.సిగడాం: మండల పంచాయతీ శాఖ ఏఈఈగా కూన లతాశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కోటబొమ్మాళి మండలంలో ఏఈఈగా పని చేసి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఈఈ సత్యనారాయణ పీఆర్ ప్రాజెక్ట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

23 నుంచి శంకర విజయంపై ప్రవచనాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాజరాజేశ్వరీ పీఠం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: కలియుగంలో సనాతన ధర్మంపై మార్గ నిర్దేశనం చేసిన దార్శనికుడు జగద్గురు శంకరాచార్యులని గుజరాతీపేట రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరి దేవీపీఠం వ్యవస్థాపకులు పెంట రామచంద్రశేఖరశర్మ అన్నారు. ఈ నెల 23 నుంచి శ్రీశంకర విజయంపై జరగనున్న ప్రవచనాలకు సంబంధించి గురువారం స్థానిక పీఠంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 23నుంచి 27 వరకు మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనపాఠి ప్రవచనాలు చెబుతారని పేర్కొన్నారు. సనాతన ధర్మం పునరుద్ధరణ చేసేందుకు శంకరులు చేసిన కృషిని వివరిస్తారని తెలిపారు. పీఠం ప్రతినిధి పెంట వాశిష్టకార్తికేయ శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో కూడా శృంగేరి శ్రీశారదా పీఠం తరఫున అహం బ్రహ్మాస్మి సంస్థ నిర్వహణలో ప్రవచనాలు జరిగాయని, ఇది రెండోసారని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రవచనాలు ప్రారంభమవుతాయని అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త అంధవరపు ప్రసాద్, ఉపనిషన్మందిరం ప్రతినిధి నిష్టల నరసింహమూర్తి, జంధ్యాల శరత్‌బాబు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సభ్యులు

రణస్థలం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు అన్నారు. హరిత సొసైటీ సభ్యులు లేఖ్య పుట్టిన రోజు సందర్భంగా చినలంకపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పలు రకాల వృక్ష జాతులు, పూల మొక్కలు నాటారు. సంరక్షణలో భాగంగా కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అభివృద్ధి పేరిట విచక్షణారహితంగా చెట్లు నరికేయడం వల్ల భూతాపం పెరిగిపోయి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు నాడు కనీసం పది మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటినాయుడు, గ్రామపెద్దలు లంక రమణ, పండు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియెగం చేసుకోవాలి

ఎచ్చెర్ల : ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు కోరారు. గురువారం చిన్నమురపాకలో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీచేశారు.

ఎన్నాళ్లీ వేదన?



కొత్త రోడ్డు వద్ద బారులు తీరిన వాహనాలు(ఫైల్)

- కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్ కష్టాలు
- ఒకే డైవర్షన్ రోడ్డుతో వాహనాల రాకపోకలకు అంతరాయం
- సింగిల్ వే కావడంతో ఇరుక్కుపోతున్న భారీ వాహనాలు
- గంటల తరబడి నరకయాతన పడుతున్న వాహనచోదకులు

కొత్త రోడ్డు జంక్షన్ అంటే చాలు వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడి కల్వర్టు పనులు పూర్తి కాకపోవడం, సింగిల్ డైవర్షన్ రోడ్డు మాత్రమే ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య నిత్య కృత్యంగా మారింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ల మేర వాహనాలు ఇరువైపులా బారులు తీరుతుండటంతో సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు.. ఇలా అన్ని వర్గాల వారు నరకయాతన అనుభవిస్తున్నారు.



డైవర్షన్ రోడ్డును తవ్వేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం కొత్త రోడ్డు బ్రిడ్జి వద్ద రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. జిల్లాలోనే అత్యంత రద్దీగా ఉండే రోడ్లలో ఒకటైన ఆమదాలవలస – శ్రీకాకుళం రహదారిలో కల్వర్టు సమస్య నెలల తరబడి పరిష్కారం కాకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప పరిష్కారానికి చొరవచూపడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా వివిధ పనుల ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేక గంటల తరబడి వాహనాల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది.

సింగిల్ వే..డబుల్ కష్టాలు..

ఆరు నెలలు క్రితం శ్రీకాకుళం–ఆమదావలస రోడ్డు పనులు జరిగేటప్పుడు వాహనాల రాకపోకలకు రెండు డైవర్షన్‌లు ఉండేవి. దీంతో ఎటువంటి ట్రాఫిక్ లేకుండా వాహనాలు ముందుకు సాగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. రైతులు తమ పంట పొలాల కోసం ఒక డైవర్షన్ అడ్డుకట్ట తొలగించారు. ఇప్పుడా నీరు అదే బ్రిడ్జి కింద నుంచి పొలాలకు వెళ్లోంది. దీంతో ఒకే డైవర్షన్ మీదుగా సింగిల్ వేలో రాకపోకలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఏదైనా పెద్ద వాహనం వచ్చినా, ఇరుక్కుపోయినా ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కల్వర్టు వంతెనపై సింగిల్ వే రాకపోకలు



పంట పొలాలకు వెళ్తున్న నీరు

పది రోజుల్లో డైవర్షన్ రోడ్డు..



కొత్త రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం జరుగుతున్న విషయం వాస్తవమే. మరో పది రోజుల్లో డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేస్తాం. పెద్దపెద్ద గొట్టాలను అమర్చి వాటి కింద నీరును పంపిస్తాం. గొట్టాలపై సమాంతరంగా 40 ఎంఎం చిప్స్‌తో రోడ్డు వేస్తాం.

– రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ

ఇబ్బంది పడుతున్నాం



శ్రీకాకుళం ఆమదావలస మధ్య వ్యాపారం నిమిత్తం నిత్యం రాకపోకలు చేస్తాను. ఉదయం, సాయంత్రం వేళ నరకం చూస్తున్నాను. పెద్దపెద్ద వాహనాలు రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పొరపాటున పెద్ద వాహనం కల్వర్టుపై ఉండిపోతే గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అవుతోంది.

– వాసు, శ్రీకాకుళం

త్వరితగతిన పరిష్కరించాలి..



మేము కొత్తరోడ్డు పరిధిలో నివాసం ఉంటున్నాం. ఏదైనా వాహనం బ్రిడ్జిపై ఆగిపోతే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. పొగ, దుమ్మూ ధూళి మా ఇళ్లల్లోకి విపరీతంగా వస్తోంది. త్వరితగతిన సమస్య పరిష్కరించాలి.

– ఈశ్వర్, కొత్త రోడ్డు

కార్యకర్తలకు అండగా నిలుస్తా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం 'కార్యకర్తే కీలకం' పేరిట రణస్థలం గ్రామ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివని కొనియాడారు.

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే ఎన్నికలలో తప్పక విజయం సాధిస్తామని చెప్పారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కూటమి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్థాయిలో ప్రజలందరికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, ఎంపీటీసీ కరిమజ్జి రమణ, నాయకులు మహంతి జోగినాయుడు, చందక రమణ, మహంతి గురునాయుడు, పసుపురెడ్డి సురేష్, కెల్ల ఆదినారాయణ, కలిశెట్టి భద్రయ్య, కెల్ల కోటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా చేపలవేట



ఆనందపురంలో గురువారం చిన్నా పెద్దా తేడా లేకుండా ఊరంతా కలిసి మంచినీటి కోనేరులో చేపలు పట్టుకోవడానికి దిగారు. ఊజులు సహాయంతో చేపలు పడుతూ సందడి చేశారు. మరికొందరు చేతులతోనే చేపలు పట్టేశారు.

– జి.సిగడాం

కప్పయాత్ర

జి.సిగడాం మండలం వెలగాడలో గురువారం కప్ప యాత్ర నిర్వహించారు. వర్షాలకు రువాంటూ ప్రత్యేక పూజలు చేశారు. కావిడిలో కప్పదేవుడిని ఇంటింటికీ తీసుకెళ్లగా పసుపు, కుంకుం, బిందెలతో నీరు తెచ్చి పూజలు నిర్వహించారు.

– జి.సిగడాం



యోగాంధ్ర వేడుకకు తరలిరండి



రణస్థలం: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత



జి.సిగడాం: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రణస్థలం: యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగమని, ఈ నెల 21న విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనం హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత కోరారు. ఈ మేరకు గురువారం రణస్థలం మండలం బంటుపల్లిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. భీమిలీ బీచ్ రోడ్డులో ఎచ్చెర్ల నియోజకవర్గానికి కేటాయించిన 10 కంపార్ట్‌మెంట్ (సీ117–సీ126)లలో ఆసనాలు నిర్వహించే ప్రదేశం, పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మండపేట, పత్తిపాడు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: విశాఖలో ఈ నెల 21న జరిగే యోగాంధ్రను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి పి.చంద్రజీవన్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ కోరారు. ఈ మేరకు గురువారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, తహసీల్దార్ ఎం.సరిత, ఏపీఎం ఆర్.రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఏఈఈ కూన లతాశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా ఉమాజఠలేశ్వర ఆలయ వార్షికోత్సవం



ఉమాజఠలేశ్వరస్వామికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త బి.అశ్వినీకుమార్, అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని పూలతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి అర్చకులు వేదుల విజయభాస్కరశర్మ నేతృత్వంలో కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు కల్యాణం

వస్త్రాల వితరణ



శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న సత్యసాయి పెద్దమందిరంలో 55 మంది మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు నూతన వస్త్రాలను గురువారం పంపిణీ చేశారు. సత్యసాయి మందిరంలో వీరంతా ఉచితంగా ట్యూషన్ చదువుతున్నారు. అనంతరం జిల్లా గ్రామసేవా నిర్వహణ ఇన్‌చార్జిగా యోగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పూర్వ అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, సేవా సంస్థల కన్వీనర్ పి.శివన్నారాయణ, చంద్రశేఖర్, అంధవరపు ప్రసాద్, సమితి కన్వీనర్ కంబ మురళీకృష్ణ పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

జామియా మసీదు అభివృద్ధికి కృషి



జామియా మసీదును సందర్శిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చారిత్రాక జామియా మసీదు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ అన్నారు. గురువారంజి.టి.రోడ్డులో ఉన్న పురాతన జామియా మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మసీదు చరిత్ర, ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీకి చెందిన బహదూర్ బాషా మాట్లాడుతూ మసీదు చుట్టూ ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చెరుకుందని, వెంటనే మరమ్మతులు చేసి గోడ ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ద్వారా నిధులు మంజూరు చేసి మసీదు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ నిజాముద్దీన్, ఎండీ అన్వర్ బాషా, ఎండీ రఫీ, అబ్దుల్ గఫర్ ఖాన్, షేక్ హుస్సేన్, షేక్ సలీం, షేక్ హైసన్, షేక్ అహ్మద్ తాజ్, రావూఫ్ ఖాన్, రహమతుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్రీకాకుళం నగరంలో అన్ని మసీదుల ముస్లింలు తమ పండగల రోజున ఒకేచోట నమాజు చేసుకునేందుకు వీలుగా ఈద్గా మంజూరు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రి ఫరూక్‌ను కోరారు. ఈ మేరకు ముస్లిం పెద్దలతో కలిసి దరఖాస్తు అందించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వక్ఫ్ స్థలాన్ని గుర్తించి కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

పీజీ వైద్య విద్యార్థులకు అందని స్టైఫండ్



రిమ్స్ వైద్య కళాశాల

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాలలోని వైద్య విద్యార్థులకు ఆరు నెలలుగా స్టైఫండ్ అందడం లేదు. వీరికి నెలకు రూ.60 వేలు చొప్పున స్టైఫండ్‌గా ఇవ్వాల్సి ఉంది. పీజీ 1, 2, 3 సంవత్సరాల విద్యార్థులు సుమారు 200 మంది వరకు ఉంటున్నారు. వీరందరికీ నాలుగు నుంచి ఆరు నెలల స్టైఫండ్ బకాయిలు రావాల్సి ఉంది. అలాగే పీజీ పూర్తి చేసి రిలీవ్ అయిన మరో 40 మందికి కూడా స్టైఫండ్ చెల్లింపు పెండింగ్‌లో ఉంది. హౌస్‌సర్జన్లకు సైతం చెల్లింపులు నెలనెలా జరగడం లేదు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెస్‌కు డబ్బులు చెల్లించి వీరంతా భోజనాలు చేయాల్సి ఉంది. హాస్టళ్లలో ఉండేందుకు కూడా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. హాస్టళ్లలో భోజనాలు బాగోలేదంటూ చాలా మంది బయటే తింటున్నారు. స్టైఫండ్ సక్రమంగా రాకపోవడంతో అన్నింటికీ తల్లిదండ్రుల నుంచి డబ్బులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్టైఫండ్ సమస్య పరిష్కరించాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు.

బిల్లు పెట్టాం

స్టైఫండ్‌కు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు దాఖలు చేస్తున్నాం. సీఎంఎఫ్ఎస్‌లో పెండింగ్ ఉండి ఉండవచ్చు. దీనిపై రాష్ట్ర అధికారులతో మాట్లాడతాం.

– డాక్టర్ వెంకటాచలం, ప్రిన్సిపాల్, రిమ్స్ వైద్య కళాశాల

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం



నిరసన తెలియజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల్ని కూటమి సర్కారు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో గురువారం వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు తల్లికి వందనంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాలం దృష్ట్యా రెయిన్ కోట్‌లు ఇవ్వాలని, భద్రతా పరికరాలు అందించాలని, నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎస్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జి గణేష్, తంగి నారాయణరావు, తుపాకుల శ్రీను, సుమన్, సోగ్గాడు, రసూల్, అర్జీ లక్ష్మి, ద్రాక్ష, సుహాసిని తదితరులు

ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీయవద్దు

అరసవల్లి : విద్యుత్ శాఖలో నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీకాకుళం డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావుపై నిరాధార వార్తలు(సాక్షి కాదు) ప్రచురించడంపై విద్యుత్ శాఖలో పలు సంఘాల ఉద్యోగులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ససపల వెంకటరావు, ఏపీఎస్ఈబీ ఇంజినీర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు సత్తారు బయ్యన్నాయుడు, సంపతిరావు శ్రీనివాస్‌లు వేర్వేరుగా జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఉద్యోగుల మనోభావాలను దెబ్బకొట్టడం సరికాదన్నారు.